క్లుప్తంగా

వీరాంజనేయస్వామి గ్రామోత్సవం



పొదలకూరు : పట్టణంలోని మారుతినగర్‌లోని పురాతన అభయ వీరాంజనేయస్వామి గ్రామోత్సవాన్ని మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దాస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిని కలెక్టర్ హరినారాయణన్ ఆకస్మికంగా బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. పెద్దాస్పత్రిలో వసతులు, డాక్టర్ల వైద్యసేవలపై పలు ఆరోపణలు రావడంతో తనిఖీలను కలెక్టర్ చేపట్టారు. తొలుత ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల విభాగాలను పరిశీలించారు. అక్కడి చిన్నపిల్లల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యసేవలపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కొన్ని ఆపరేషన్ థియేటర్లను ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదని సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. అన్ని ఆపరేషన్ థియేటర్లను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పనికిరాని వైద్య పరికరాలు, ఇతర వస్తువులను వేలం వేయాలని, అవసరమైన నూతన పరికరాల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. వైద్యసేవలను ఒకే భవనంలో అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని, అలసత్వం వహించే డాక్టర్లపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో డ్యూటీలో ఉండాల్సిన పలువురు డాక్టర్లు ఉరుకులు, పరుగులతో వార్డుల్లోకి వచ్చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, హెచ్‌డీఎస్ సభ్యుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగిల్ నంబర్లాటను నిర్వహిస్తున్న వ్యక్తిని నవాబుపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన యజ్దానీ వెంకటేశ్వరపురం సెంటర్‌లో సింగిల్ నంబర్లాటను నిర్వహిస్తుండగా నవాబుపేట ఎస్సై శివప్రకాష్ అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.వెయ్యి, లాటరీ చార్ట్, స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఆఫీసర్ భవానీ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లలితా జ్యువెలరీలో క్యాషియర్, బిల్లింగ్, గోల్డ్ స్మిత్, అకౌంటెంట్, టెలిఫోన్ ఆపరేటర్స్, డ్రైవర్స్, ఆఫీస్ అసిస్టెంట్.. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు గానూ జాబ్‌మేళాను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయానికి ఉదయం పది గంటలకు హాజరుకావాలని కోరారు.

గంజాయి విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలపై నవాబుపేట పోలీసులు దాడులు జరిపి విక్రేతతో పాటు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నవాబుపేట పోలీస్‌స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు బుధవారం వెల్లడించారు. శెట్టిగుంట రోడ్డు ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ సతీష్ విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరులో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి 1.3 కిలోల గంజాయిని నెల్లూరుకు మంగళవారం తీసుకొచ్చారు. శెట్టిగుంటరోడ్డు సెంటర్‌లో అహ్మద్‌నగర్‌కు చెందిన జేమ్స్, కామాక్షి, ప్రేమ్, ఆచారితో పాటు బాలాజీనగర్‌కు చెందిన యువకుడికి విక్రయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ దాడులు చేశారు. సతీష్‌తో పాటు జేమ్స్, కామాక్షిని అరెస్ట్ చేసి జువెనైల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు. ఎస్సైలు తిరుపతయ్య, శివప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

నెల్లూరు(పొగతోట): బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ పేర్కొన్నారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలు రుణాలను సక్రమంగా చెల్లించి సంస్థల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు (కోవూరు): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముదివర్తి కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరగా, సచివాలయ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ముదివర్తిలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.10.86 కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గడప గడపకు సంక్షేమ పథకాలు చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, జెడ్పీటీసీ లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్ రెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అచ్యుత్‌రెడ్డి, విజయభానురెడ్డి, ఎంపీటీసీ సౌందర్య, సర్పంచ్ నిర్మలమ్మ, తిరుపతి, సురేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



వెంకటాచలం: లతీష కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూజితారెడ్డి

వెంకటాచలం: సాగునీటి కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఇద్దరు బాలికలు లతీష, అక్షిత, కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి పేర్కొన్నారు. కసుమూరు పంచాయతీ చింతలపాళెంలోని లతీష, అక్షిత కుటుంబ సభ్యులను బుధవారం ఆమె పరామర్శించారు. ప్రమాదవశాత్తు ఇద్దరు బాలికలు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. బాధిత కుటుంబాలకు తన సొంత నిధుల నుంచి రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అక్షిత కుటుంబం పూరింట్లో నివాసం ఉంటున్న విషయం తెలుసుకుని గృహ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కడివేటి శివ, చీకుర్తి నరసయ్య, గుర్రం పుట్టయ్య, తదితరులు ఉన్నారు.

పొదలకూరు : మండలంలోని ఊట్లపాళేనికి చెందిన మోడిబోయిన కాంతారావు, జ్యోతి(వలంటీర్) దంపతుల పదేళ్ల కుమారుడు శ్రీనివాసులు తిరుమలకు కాలినడకన వెళ్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి బుధవారం పరామర్శించారు. దైవ దర్శనానికి వెళ్తూ బాలుడు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం తన తాత కాకాణి రమణారెడ్డి మెమోరియల్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య, స్థానిక నాయకులు గోపాలయ్య, జయరామయ్య, తదితరులు ఉన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం

పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రాని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

- అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు బుధవారం తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పొదలకూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. 8న సూరాయపాళెం, 9న విరువూరు, 13న మహ్మదాపురం, 14న తాటిపర్తి బిట్-1, 15న తాటిపర్తి బిట్-1, 16న నావూరు, 17న నేదురుమల్లి, 20న ప్రభగిరిపట్నం, 21న బత్తులపల్లి, 22న వావింటపర్తి, 23న మొగళ్లూరు, 24న కనుపర్తి, 27న ఆర్‌వైపాళెం, 28న బిరదవోలు, 30న దుగ్గుంట, జూలై 1న డేగపూడి, 4న ఇనుకుర్తి, 5న పొదలకూరు బిట్-1, 6న పొదలకూరు బిట్-2, 7న పొదలకూరు బిట్-3, 11న పొదలకూరు బిట్-4, 12న తోడేరు, 13న మరుపూరు గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయని వివరించారు. ఆర్‌ఐ, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు అన్ని రకాల రికార్డులతో సదస్సులకు హాజరుకావాలని కోరారు.

నేడు ఎల్‌ఎన్‌పురానికి మంత్రి కాకాణి రాక

మనుబోలు: మండలంలోని లక్ష్మీనరసింహాపురం గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం 5 గంటలకు పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఉప్పలపాటి రామసుబ్బానాయుడు బుధవారం తెలిపారు. నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు.

మహిళపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం: పొలం బాట వివాదం నేపథ్యంలో మహిళపై కొందరు దాడికి పాల్పడిన ఘటన మండలంలోని పల్లాప్రోలులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. పల్లాప్రోలుకు చెందిన కావలి శీనయ్య, కావలి వెంకటేశ్వర్లు మధ్యన పొలం బాట విషయమై గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కావలి శీనయ్య, సరస్వతి దంపతులు తమ పొలానికి వెళుతుండగా కావలి వెంకటేశ్వర్లు అడ్డుకున్నాడు. భార్య విజయమ్మ, సోదరుడు వెంకయ్య, ఆయన భార్య రాజేశ్వరి , కుమారుడు మోహన్, వీరయ్యతో కలిసి సరస్వతిపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తి పాళెంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డాక్టర్ యశోధర బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి, ఆయన అధికార నివాసాన్ని ఖాళీ చేయించడం దుర్మాగపు చర్యగా పేర్కొన్నారు. రాహుల్‌గాంధీకు దేశ ప్రజలు అండగా నిలిచి రాబోయే ఎన్నికల్లో గెలిపించి ఆయన్ని ప్రధాన మంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. నాయకులు అమ్మణ్ణి, రమణమ్మ, రమణయ్య, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు జగనన్న విద్యా కానుకలు



ట్రాక్టర్‌లో జగనన్న విద్యా కానుకలను తరలిస్తున్న దృశ్యం

కొడవలూరు: మండలంలోని పాఠశాలలకు కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి జగనన్న విద్యా కానుకలను బుధవారం తరలించారు. మండలంలోని ఏడు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో 80 పాఠశాలలు ఉండగా, అందులోని రెండు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని 16 పాఠశాలలకు తొలుత కానుకలు తరలించారు. మరో రెండ్రోజుల్లో మిగిలిన అన్నీ పాఠశాలలకు జగనన్న విద్యా కానుకలు తరలించి పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందజేయనున్నట్లు ఎంఈఓ జీ వసంతకుమారి తెలిపారు. స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు విద్యాకానుకల తరలింపునకు రవాణా చార్జీలను సైతం ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డీ ఇందిరాదేవి, ఎంఈఓ కార్యాలయ డీఈఓ జీ విజయమ్మ, ఐఈఆర్టీ కోఆర్డినేటర్ సునీత, సీఆర్పీలు పెంచలరావు, ఎం దయాకర్, అసిస్టెంట్ మస్తానయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



వెంకటాచలం: డ్రామా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కొడవలూరు: చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కే రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా వేసవి విజ్ఞాన శిబిరానికి రావడం వల్ల వారిలోని ప్రతిభ ఎంతో మెరుగు పడిందన్నారు. శిబిరంలో చిత్రలేఖన సాధన చేసిన విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో అబ్బురపరిచే ప్రతిభ కనబరిచారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు శిబిరం ముగింపు రోజున బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

వెంకటాచలం: స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, డ్రామా, ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రేవతి మాట్లాడుతూ 30 రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించామని పేర్కొన్నారు.

చాముండేశ్వరిదేవి హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,57,666 ఆదాయం వచ్చినట్లు ఈఓ శాంతయ్య తెలిపారు. అన్నప్రసాద వితరణ కోసం అదనంగా మరో రూ.4,545 నగదును విరాళంగా అందజేసినట్లు వివరించారు. దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి కే చైతన్య, ఆలయ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కెనరాబ్యాంక్ మేనేజర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోదండరాముడి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



నూతనంగా నిర్మించిన కోదండరామాలయం

కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెంలో మారంరెడ్డి శేషురెడ్డి, లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థంగా మారంరెడ్డి నారసింహారెడ్డి తన సొంత నిధులతో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం గోపూజ, విష్వక్సేన ఆరాధన, రక్షాసూత్రధారణం, అఖండ దీపస్థాపన, హోమకుండ సంస్కారం, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ట చతుర్వ్యూహ మంత్ర హోమాలు, సాయంత్రం అంకురార్పణ, దేవతాహ్వానం, గరుడ పతాక ఆవిష్కరణ, విశేష మంత్ర హోమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం విమాన ప్రతిష్ట, విశేష హోమాలు, ప్రధాన కలశత్రయ మండలారాధనలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం యంత్ర స్థాపన, శిఖర కలశ చక్రస్థాపన, విగ్రహ ప్రతిష్ట, వాహన మండప, అలంకార మండప, కల్యాణ మండప ప్రధాన ప్రవేశ ద్వార ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ట, కుంభ దర్శనం, సర్వదర్శనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జూలై 19 నుంచి కోటి కుంకుమార్చన



కోటి కుంకుమార్చనపై సమీక్షిస్తున్న ఆలయ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో జూలై 19 నుంచి 29వ తేదీ వరకు కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పాలక మండలి సభ్యులు, అర్చకులతో కోటి కుంకుమార్చనకు మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో పదకొండు రోజుల పాటు కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు నందుకుమార్, రఘురామయ్య, కామేశ్వరి పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



గృహ లబ్ధిదారులకు రుణ నగదు అందజేస్తున్న మెప్మా సీఓ నర్మద

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ గృహ లబ్ధిదారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సీఓ నర్మద కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో గృహ లబ్ధిదారులకు బ్యాంకు రుణాలను బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గృహ లబ్ధిదారునికి బ్యాంకు ద్వారా రూ.35 వేలు రుణంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నగదును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఇంటి నిర్మాణానికి అదనపు వసతులు చేకూరుతాయని చెప్పారు. ఇప్పటికే నగర పంచాయతీ పరిధిలో 200 మంది బ్యాంకు రుణాలను పొందారని, మిగిలిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రిసార్ట్స్‌కు కేటాయించిన స్థల పరిశీలన



స్థలం వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జేసీ కూర్మనాథ్

ఇందుకూరుపేట: గంగపట్నం రెవెన్యూ పరిధిలోని పల్లిపాళెం సమీపంలో సముద్రతీరంలో బీచ్ రిసార్ట్స్ కోసం ప్రతిపాదించిన స్థలాన్ని జేసీ కూర్మనాథ్ బుధవారం పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ సుబ్బయ్య, సర్వేయర్ హరనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ రిసార్ట్స్ ఏర్పాటు చేస్తే పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. జేసీ వెంట ఆర్‌ఐ జీవన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు సీతారాముల కల్యాణం నిర్వహించారు. నగర పంచాయతీ వైస్‌చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన కాలనీలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో రామాలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు వివరించారు.

పరిసరాల శుభ్రతను పాటించాలి



ముత్తుకూరు: గోపాలపురంలోని సీవీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ ఆధ్వర్యంలో సీవీఆర్ కాంప్లెక్స్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులతో పాటు కాలుష్య నివారణకు పరిసరాల శుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గంగాసతీష్, సెక్యూరిటీ డీజీఎం మనోహర్‌బాబు, పుచ్చలపల్లి శ్రీనివాసులు, శివ, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం: సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ సుధీర్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాలను బుధవారం వారు వేర్వేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా బయోమెట్రిక్ హాజరువేయాలని ఆదేశించారు. ప్రతి సచివాలయంలో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రదర్శించాలన్నారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన

కోవూరు: వరి సాగుచేసేరైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి ఇఫ్కో నానో డీఏపీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి పంటలో నానో డీఏపీ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు మాట్లాడుతూ ఇఫ్కో నానో డీఏపీపై అవగాహన కల్పించారు. 500 మి.లీ నానో డీఏపీ ఒక బస్తా సాధారణ డీఏపీకు సమానమని వివరించారు. నానో డీఏపీ 500 మి.లీ. బాటిల్ ధర రూ.600 మాత్రమేనని తెలిపారు. రైతులు పొలానికి సులభంగా తీసుకెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఏఓ ఇందిరావతి, ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ, కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



బాధితురాలిని పరామర్శిస్తున్న కౌన్సిలర్ ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం: పూరిల్లు అగ్నికి ఆహుతైన ఘటన నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎస్‌ఆర్ పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..డీఎల్‌ఎస్‌ఆర్ పాఠశాల సమీపంలో కోనేటి విజయమ్మ అనే వృద్ధురాలు పూరింట్లో నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి ఆమె తన మనుమళ్లతో కలిసి ఆరుబయట నిద్రిస్తుండగా మంటలు చెలరేగి ఒక్కసారిగా ఇల్లు మొత్తం వ్యాపించాయి. ఆమె గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు కాలిపోగా కట్టుబట్టలతో మిగిలామని బాధితురాలు వాపోయారు. స్థానిక కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ బాధితురాలిని బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.